
# అడవిమొక్క




కలప కోసం ఏజన్సీలో తెల్లవారి గుర్రం వేసుకు బయలు దేరేడంటే, రామస్వామికి 'ఆ' అంటే అడవీ 'కో' అంటే కోనలూ తిరిగి తిరిగి పని చూసుకుని వచ్చే వేళకు ఏడెనిమిది గంటలకు పైన పట్టేది రామస్వామిని చూస్తే యితనికి కష్టాలు రాకూడ దని పిస్తుంది ఆ దట్టించి కట్టిన పంచెతో జీనుమీద చూడగానే అతని కోరమీసం ఆ చూపులోని ఒడుపూ, ఆమనిషిలోని చేవ, ఆ చేతిలోని హంటరు ఝళిపింపుకు అడివి అడివంతా లొంగి పోవలసిందే! అడివే లొంగిపోగా ఆడ దనగా ఎంత? ఆ డ వా ళ్ళు —

వాడి పక్కన ఉన్నది, పచ్చల పిడిబాకు అది ఎదలో ఒకసారి అదిమినా

చాలోయి -

ఉంగరాల జుట్టు రంగైన మగవాడు
కోసావ ఒకసారి కసరి తిట్టినచాలు !
అనుకుని
'మగవాన్ని కౌగింట మరణించినా చాలు
కంటికి కనబడితేనా వాడు – కదలునా
అడుగేసి ?'

అవి దారులు కాసేవారట ! అతని కోసం పొరుగూళ్ళో పని కల్పిస్తే ఆ వ్యవహారం అర్ధ మధ్యస్తంగా వదిలేసి ఎక్కడికో మాయమయి పోయేవాడు. ఆతన్ని తండ్రి వ్యవసాయంలో పెట్టాడు. వ్యవసాయం మన్నుకొట్టుకు పోయింది. వ్యాపారంలో పెట్టాడు. అది నీళ్ళుకారిపోయింది. గోదారి గట్టు మీద గుర్రంమీద వచ్చే రామస్వామిని చూస్తే వెర్రిభ్రమచేత ఆడపిల్లలచేతుల్లో బిందెలు నీటిలో మునిగేవి కావు.

ఆ అడవులు, ఆ పల్లెలు, ఆ కొండలు, తొళ్ళు, అక్కడి ఏరులు, చిన్న చిన్న వాగులు సైతం తెలిసిన వాడు. అందులో ఎరుకలు, కోయలు, గదబలు కొండజాతి వారు అనేకులు ముఠాలు ముఠాలుగా జీవిస్తూ ఉండేవారు. ఉప్పు, అగ్గిపెట్టెలు, సూదీ దారం, అద్దాలు పట్టుకు వెళ్ళే వాడు. ఇతను వారందరికీ యిష్టసఖుడు.

ఇలా ఉండగా –

జమిందారులు యుద్ధంలో అడివిని అమ్మేసి బంగారం పోగేశారు. రామస్వామి అడివిలోనే మకాం పెట్టాడు. బంగారం లాటి అనుభవాన్ని పోగేశాడు.

అడవిలో ఒకచోట ఒక ఎత్తైన గుట్ట ఉన్నది. దాని మీద ఉన్న చెట్లు యిన్నీ అన్నీ కావు. ఆ ప్రక్కన ఒక కుంట ఉన్నది. అందులోకి ఎక్కడ నుంచి వస్తుందో తెలియదు కాని కొండ తొళ్ళ మధ్య బాటలలో నుంచి నిరంతరం నీళ్ళు కారుతూఉంటాయి. చుట్టూ మొక్కలూ మొటికలూఉన్నాయి. అటువంటి మరుగైనచోట ఒక సాయంత్రం యింటికి మళ్ళుతూ గుర్రానికి నీళ్ళు పట్టించటం కోసం త్రిప్పగానే–

అంతవరకూ గట్టుమీద యిసికలో కొంతా నీటిమీద కొంతా శరీరాన్ని జారవిడచి వెల్లకిలావరుండి మబ్బుల్నీ, పాలపిట్టల్నీ, చెట్ల ఆకుల గలగలను వింటూ స్వప్నావస్థలో ఉన్న లంబాడీ చిన్నది చేపలా నీటిలోకి దిగజారింది. తలకట్టు, ఓరచూపులు యివే మిగిలాయి. రామస్వామి గుర్రంమీదనుంచే కమిచీతో చిన్నదాని దుస్తులు అందిపుచ్చుకొన్నాడు. ఆ వెర్రెత్తించే బుజాల వంపులకి, ఆ చిన్ని చిబుకానికి, నీళ్ళలో తడిసి ఎదురు రొమ్ములమీద ప్రాకుతూ ఆడుకుంటున్న ఆజుత్తుకీ దాసోహ మనక ఏమిచేస్తాడు ఏ మగ మహారాజు మట్టుకూ ?

ఆ బట్టల్ని చిటారు కొమ్మన మిఠాయిపొట్లంలా కట్టి తనువు మరచి తాహతు మరచి నీటిలోకి దిగాడు ఉంగరాల జుత్తు రంగైన మగవాడు రామ



స్వామి ఆ లంబాడీ చిన్నది ఆవలి తట్టునుంచి గట్టుమీదకు ప్రాకి రామ స్వామి లాల్చీ పంచె పట్టుకుని పరుగెత్తింది, ఈ కవ్వింపుతో అడివి అడివంతా అర్థమయింది రామస్వామికి

పురూరవుడిలా వెంటబడి తరిమి తరిమి పట్టుకున్నాడు ఆ చిన్నదాన్ని

చెంపనా సంపంగి నూనె,

అంచునా చెంగల్వ మొగ్గ

ఏటివడ్డున యిల్లు కడదాం పదరా,
ఏరువస్తే యీది పోదాం పదరా
చల్ మోహనరంగా

అనుకున్నారు తరువాత వారికి లోకంతో నిమిత్తం లేకుండాపోయింది చెట్టాపట్టా లేసుకుని

వేళజాడ వెన్నెలాయె, వెండికట్ల
కిన్నెరాయె
మల్లెపూల పందిరాయె, వయ్యారి రావె
నవ్వులోనె తెల్లవారును!
కొండగోగులు పూసెనేమొ, కొండ
నిమ్మలు కాసెనేమొ,
దొండపండు లాంటి పెదిమె,
వయ్యారి రావె
మనసు ఎవరి పాలు జేతును?
మల్లెపూవులు పూసినట్లు
మళ్ళి మళ్ళి మాటలాడు
మల్లెపూలవంటి మనసు వయ్యారి రావె
— పూవులెవరి పాలజేతును?

అప్పుడు మేలినడల అందమైన వయ్యారివచ్చి గంధం పూయించుకునేది అడివిపూలు ముడిపించుకునేది. అడవిమొక్కకు అడివిపూలే అందం! అంతా వింత వింత రంగులతో అలంకరించు కున్నట్లు, సృష్టి అంతా తమ

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

కోసమే వేచిఉన్నట్లు, గాలివీస్తే, ఆకు లల్లాడితే, పిట్టలుకూస్తే అవి తమ మోహాన్ని గూర్చే చెప్పుకుంటున్నట్లు, తోచేది రామస్వామికి

ఈలోగా గోదావరి వరద లొచ్చేయి. జీడి మామిడి తోటలు మునిగిపోయాయి. వరద గోదావరికి కొబ్బరికాయలు కొట్టి అరటిపళ్ళు నైవేద్యం పెట్టి పసుపు కుంకుమా యిచ్చి జనులు మంగళ హారతులు పాడారు. ఏమని?

'నూనె ధారకుమల్లె నురగాలు యెత్తుచు
పాల ధారకుమల్లె పరుగెత్తుచూ
ముల్లనక ముడికనక క్రనక కంపనక
చెలరేగి ప్రొద్దేడ కదిలేటి గంగా'

ఆ వరదల్లో రామస్వామి చేసిన తప్పు, ఆ అడివిమొక్కను ఊళ్ళోకి తెచ్చాడు. ఊరు గుప్పు మంది

'కామార్తాహి ప్రకృతి కృపణా
స్చే తనా చేతనేషు'

[illegible] కోడలు నరసమ్మ [illegible] కాపు రానికి వచ్చింది అని గింజుకున్నాడు రామస్వామి తండ్రి వెర్రి బాగులది తన కోక ఎత్తుకుపోతున్నా చూస్తూ ఊరుకునేది. మగ మహారాజు లను ఏమన గలదు?

'బటానీల కోకమీద కన్నేసాడే!
సెనగపువ్వు రయికమీద చెయ్యేసాడే' అంటూ నాయుకికి వినిపించేలా గోలచేసే వారు కుర్రకారు. అనుభవాలు ఎవరికి మాత్రం కలగవు? చేలల్లో, సంతల్లో, దొంకలమ్మట,

పుంతలమ్మట, గా దె ల వెనకాల, గడ్డివాముల ప్రక్కన, వ ర్షం లో, ఎండలో, వెన్నెల్లో, చీకట్లో, ఎరుపో, తెలుపో, నలుపో, మనస్సులోనుంచి ఆత్మను చుట్టబెట్టే యీ లోకానుభూతు లను ఎట్లా కాపాడుకోవాలో ఆఒడుపు తెలియని వాళ్ల లోకానికి బలిఅవుతారు వెంట అపప్రథలే మోసుగుని తిరుగు తారు. లంబాడీ చిన్నదానికి అ ద్దా ల పరికిణీ జుబ్బాకి బదులు చీరా రవికా కట్ట బెట్టాడు.


తోటలో డాబాకి దాని మకాం మార్చి అడివితో విరోధం తెచ్చు కున్నాడు. ఊరు ఊరంతా అలిగింది.

ఆకుపచ్చని సిరాలాటి అడివిలో' నీలి నీలాంబరపు కప్పుక్రింద, కొండ కోనలలో చిక్కని అడవి మొక్క నాలుగు గోడల నాగరికతకు ఎదురు తిరగ నారంభించింది.

ఇల్లరికం వెళ్ళిన నారాయణస్వామి తమ్ముడు కుత కుతా ఉడికి పోతు న్నాడు. మరదలు లాంటి బందుగుల సంగతి సరేసరి!

ఆ ప్రణయం ఆ మోహం ఎలాటి దని తోట నడిగితే, తోట అంటుంది కదా –

'కళ్లల్లో ముద్దెట్టుతూ–తెల్లారనీ నంటదీ
తెల్లారి పోతుంటె తా – నెల్లాగా
అయిపోతదీ' అని



రామస్వామి నడిగితే—

'చీకట్లో కేకెడతదీ, కేకెడుతు
కిందడతదీ
ఏకాడ తడుమూదురా ? ఆ కన్నె
అతి లేతరా !
పీకాను కాలేతునో ? - పయ్యేంట
చెయ్యింతునో ?'

అని వాపోతాడు.

అడివి అంతా తిరగబడింది దాని వాళ్ళంతా దానికోసం వచ్చారు. అర్ధమ రేతిరి నిద్దురలో లేపినందుకు గినిసి

'చిన్నాది పూ దేనెరా—కవటాకులో
ఈనెరా
పున్నామి నెలబరణిరా —
ముమ్మొదట నా రాణిరా !'

అని సమాధానం చెప్పి చూశాడు కుదరలేదు దొమ్మిలో రామస్వామి బాణాక్ర విరిగి పోగానే చీకట్లో రవి కల్లో యిముడని అ అడవి మొక్క వచ్చి అతడ్ని వాటేసుకున్నది

విసరిన కత్తిపోటుకు లంబాడీ చిన్నది చిలకలా ఉన్నది తోటలో నెత్తుడి మడుగులో తురాయి చెట్టులా కూలింది

'ఊదేస్తె గాలౌతదీ - రోదిస్తె నభమవు
తదీ
దరి తీస్తె సీరౌతదీ - బరిగీస్తె ధరణవు
తదీ
పొగస్తె కర్ర కగ్గవుతదీ'- ఇగ నాకు దారే
దిరా ?'

అని చెప్పుకుని చెప్పుకుని ఏడ్చాడు రామస్వామి !

కామాంధుడవు ఘోష - పొమ్మంది లోకం

ప్రేమించకు ! అడవి మొక్కను ప్రేమించకు అని తోట చెప్పింది.

[షరా -

'నావపై పిల్ల' పాట వ్రాసిన కవి కొండల వెంకటరావు గారికి వందనాలు!

డాక్టర్ రామరాజు గారి జానపద గేయాల ధీసిస్సు ఎలా చదివానో నాకైతే జ్ఞాపకం లేదుకాని, అప్పుడు ఢిల్లీలో నోటు చేసుకున్నాను నాకు నచ్చిన పదాలను. వారికి చాలా థాంక్స్ గురువుగారు 'రామకృష్ణశాస్త్రిగారు వెళ్ళిపోయారనగానే మనస్సు చివుక్కు మని వ్రాశాను ఏదో ఉడతాభక్తి ! ఇంకోటి మన కుర్రాళ్ళకు మంచి ప్రేమ కధ వోటి అందించాలనే ప్రయత్నం చేశాను పాత ఫక్కీలో అదీగాక కొత్త పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ మల్లెపందిరి క్రింద చదువుకుని ఆనందించేలా వ్రాయాలని కూడా తోచింది అంతే !]

— పురాణం సుబ్రమణ్య శర్మ

***